ప్రజాశక్తి
గురువారం 4 జులై 2024
5
విజయనగరం



నేడు అల్లూరి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జూలై 4 వ తేదీన అల్లూరి సీతారామ రాజు జయంతి సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం ఉదయం 9.30 గంటలకు వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. జిల్లా అధికారులు, కలెక్టరేట్ ప్రాంగణం లో నున్న కార్యాలయాల అధికారులు, సిబ్బంది ఈ వేడుకలకు హాజరు కావాలని ఆదేశించారు. అన్ని జిల్లా, డివిజినల్, మండల, గ్రామ స్థాయి కార్యాలయాల్లోనూ అల్లూరి జయంతి వేడుకలను నిర్వహించాలని సర్క్యులర్ జారీ చేసారు.

టిడిపి, జనసేన మధ్య కోల్డ్‌వార్



- నెల్లిమర్ల నియోజకవర్గంలో పొసగని పొత్తు
- విజయం తరువాత టిడిపికి తగ్గిన ప్రాధాన్యత?
- తమ్ముళ్లకు సమాచారం లేకుండానే సభలు, సమావేశాలు
- ఎమ్మెల్యే తీరుపై గుర్రుగా టిడిపి నాయకులు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నెల్లిమర్ల నియోజకవర్గంలో టిడిపి, జనసేన నాయకుల మధ్య కోల్డ్‌వార్ అప్పుడే రాజుకుంటోంది. ఎమ్మెల్యే లోకం మాధవి ఎన్నికై ఇంకా నెల రోజుల కాకముందే ఇరుపార్టీల్లో విబేధాలు బయట పడుతున్నాయి. జిల్లాలో ఎక్కడా లేని విధంగా నెల్లిమర్ల సీటును పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు. ఆ సందర్భంగా రెండు పార్టీల మధ్య మొదలైన వార్ అదినాయకత్వం జోక్యంతో సద్దిమణిగింది. ఎన్నికల్లో రెండు పార్టీల నాయకులూ కలిసి కట్టుగా పనిచేసి మాధవి విజయానికి తోడ్పడ్డారు. మాధవిని గెలిపించాలని టిడిపి నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఆమె గెలుపు కోసం అహర్నిశలు కష్టపడ్డారు. ఆమె కూడా ఎన్నికల ముందు టిడిపి నాయకులతో కలిసి తిరిగి, గెలిచిన తరువాత వారికి ప్రాధాన్యతను తగ్గిస్తూ వస్తున్నారు. దీంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు.

నియోజకవర్గంలో ఎమ్మెల్యే లోకం మాధవి విజయం తరువాత కొత్త పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వంలో రెండు పార్టీల నాయకులూ కలిసి కట్టుగా పనిచేయాలని అధినాయకత్వం పదే పదే చెబుతున్నా ఇక్కడ ఎమ్మెల్యే మాత్రం పట్టించుకోవడం లేదని టిడిపి నాయకులు అంటున్నారు. గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి నాయకులు ఆమెను కలిసేందుకు వీలు లేకుండా వ్యవహరిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ఎమ్మెల్యే అయిన తరువాత టిడిపి నాయకులతో కలిసి కట్టుగా పనిచేస్తారని భావించినా ఆ స్థాయిలో వారికి గౌరవం దక్కడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. సభలు, సమావేశాలు, పింఛన్ల పంపిణీ సహా టిడిపి నాయకులకు పెద్దగా సమాచారం ఉండటం లేదని అంటున్నారు. మొదటి నుంచీ జనసేనలో ఉన్న నాయకులకు తప్ప టిడిపి నాయకులకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదని తెలిస్తోంది. దీంతో తెలుగు తమ్ముళ్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

అక్కడో మాట.. ఇక్కడో మాట..

లోకం మాధవి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత నెల్లిమర్ల మండలంలోని టిడిపి సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామ, మండల స్థాయి నాయకులందరికీ ఒకేసారి పరిచయ వేదిక పెట్టి వారిని పరిచయం చేద్దామని టిడిపి నాయకులు అనుకున్నారు. అనుకున్న ప్రకారం టిడిపి నెల్లిమర్ల మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్, అధికార ప్రతినిధి గేదెల రాజారావు ఇటీవల ఆమెను కలిసి పరిచయ వేదిక పెట్టాలని కోరారు. గతనెల 28న వల్లూరులో రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామని దానికి తమరు రావాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో ఆమె రెండు కార్యక్రమాలూ వల్లూరులో పెట్టేయండని, తాను వచ్చి పరిచయంతో పాటు రైతులకు విత్తనాలు కూడా సరఫరా చేసేస్తానని చెప్పారు. దీంతో ఆనంద్ వెంటనే మండలంలో ఉన్న సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి నాయకులందరినీ వల్లూరు రావాలని సమాచారం ఇచ్చారు. దీంతో సర్పంచులు, ఎంపిటిసిలు తమ అనుయాయులతో కలిసి ఉదయం 10 గంటలకే అక్కడకు చేరుకున్నారు. కానీ రైతులకు విత్తనాలు పంపిణీ పూర్తయిన వెంటనే ఆమె పరిచయ వేదిక సంగతిని పక్కన పెట్టి కనీసం మండల నాయకులకు చెప్పకుండానే స్టేజ్ దిగి వెళ్లిపోయారు. దీంతో అప్పటికే అక్కడికి వచ్చిన నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెను గెలిపించడానికి ఇంత కష్టపడితే కనీసం తమను కలవడానికి కూడా ఇష్టపడకపోతే ఎలా అని మండిపడ్డారు. ఇలా అయితే నియోజకవర్గంలో ఈ ఐదేళ్లు తమ పరిస్థితి ఏంటని ఆనంద్‌ను పారసాం సర్పంచ్ నారాయణరావు, గరికిపేట మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ నిలదీశారు. దీంతో ఆయన మాట్లాడుతూ అక్కడ ఒకే అని చెప్పి ఇక్కడకు వచ్చిన తరువాత ఆమె ఇలా చేస్తారని అనుకోలేదని, మరోసారి కార్యక్రమం పెడతామని సర్దిచెప్పారు. మిగతా మండలాల్లో కూడా ఇదే పరిస్థితి ఉందని, ఎమ్మెల్యే టిడిపి నాయకులను పట్టించుకోవడం లేదని సాక్షాత్తు నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు ముందు పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు మొర పెట్టుకున్నారు. అధికారం వచ్చి నెల రోజులు కాకముందే ఎమ్మెల్యే పరిస్థితి ఇలా ఉంటే భవిష్యత్తులో ఎలా ఉంటారోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి తరుణంలో బంగార్రాజుకు ఎమ్మెల్సీ ఇవ్వకపోతే నియోజకవర్గంలో టిడిపి కనుమరుగై పోయే ప్రమాదం ఉందని ఆపార్టీ నాయకులు అంటున్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- కోనూరులో పిహెచ్‌సి, జెడ్‌పి హైస్కూల్ పరిశీలన
- ఆస్పత్రిలో ప్రసవాలు జరగకపోవడంపై అసంతృప్తి
- నెలరోజుల్లో పనితీరు మెరుగుపడాలని ఆదేశాలు
- హైస్కూల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా
- విద్యార్థులతో మాట్లాడి వారి పరిజ్ఞానం తెలుసుకున్న కలెక్టర్ అంబేద్కర్



కోనూరు పాఠశాలలో విద్యార్థులను పాఠ్యాంశాల గురించి ప్రశ్నిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-గరివిడి

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు ఏవిధంగా సేవలు అందుతున్నాయనే అంశాలను తెలుసుకునేందుకు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బుధవారం నుంచి క్షేత్రస్థాయి పర్యటనలకు శ్రీకారం చుట్టారు. ముందుగా వైద్య, విద్యాశాఖల పనితీరుపై పరిశీలన చేశారు. దీనిలో భాగంగా గరివిడి మండలంలో పర్యటించి కోనూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రసవాలు, ఒపి. తనిఖీలు, మందుల సరఫరా, పరికరాల వినియోగం వంటి వివిధ అంశాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణ, వైద్యుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ నెలరోజుల్లో తమ పనితీరు మెరుగుపరచుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. నెలరోజుల తర్వాత కూడా పనితీరు మెరుగుపడకపోతే చర్యలు తప్పవని స్పష్టంచేశారు.

పిహెచ్‌సిలో ప్రసవాల గురించి కలెక్టర్ ఆరా తీయగా ఎంతగా వారిని ప్రోత్సహిస్తున్నా ఇక్కడ ప్రసవాలకు గర్భిణీలు ఎవరూ ముందుకు రావడం లేదని, చీపురుపల్లి సిహెచ్‌సికే వెళ్లి అక్కడ ప్రసవాలు చేసుకునేందుకే మొగ్గు చూపుతున్నారని వైద్యాధికారి వెంకటరమణమ్మ వివరణ ఇచ్చారు. దీనిపై సంతృప్తి చెందని కలెక్టర్ నెలరోజుల్లోగా ఇక్కడ ప్రసవాలు నమోదు కావాలని స్పష్టంచేశారు. లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆసుపత్రిలో ఫిజియోథెరఫీ కోసం సరఫరా చేసిన పరికరాలు దుమ్ము పట్టి వుండటాన్ని గమనించి వాటిని వినియోగంలోకి తీసుకు రావాలని చెప్పారు. ఒపి సంఖ్య తక్కువగా వుండటంపై కలెక్టర్ ఆరా తీశారు. ఒక వైద్యుడు మాత్రమే ఒపి ఎందుకు చూస్తున్నారని ఇద్దరూ ఒపి తనిఖీలు చేయాలని స్పష్టంచేశారు. స్టోర్‌ను పరిశీలించి మరికొద్ది రోజుల్లో గడువు తీరిపోయే మందులు వుండటాన్ని గమనించి వాటిని ఇంకా స్టోర్‌లో ఎందుకు వుంచారని, అలాంటి మందులు రోగులకు ఇస్తే వారి ప్రాణాలకు ప్రమాదమని చెబుతూ స్టోర్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆసుపత్రిలో వివిధ అనారోగ్య కారణాలతో చేరిన రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.



పిహెచ్‌సిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

జెడ్‌పి హైస్కూల్ నిర్వహణపై సంతృప్తి

కోనూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల విద్యా విషయ పరిజ్ఞానాన్ని పరీక్షించడంతోపాటు మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా పదోతరగతి విద్యార్థులతో ముచ్చటించారు. బయాలజీ పాఠ్యపుస్తకంలో వున్న పాఠ్యాంశాలపై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి పరిజ్ఞానాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు. మధ్యాహ్న భోజనంకోసం కట్టెల పొయ్యిపై వంటలు చేయడాన్ని గమనించి గ్యాస్ పొయ్యి సరఫరా చేస్తామని, వెంటనే జిల్లా పౌరసరఫరాల అధికారిని సంప్రదించాలని ఆదేశించారు. పాఠశాల విద్యార్థులకు సరఫరా చేసిన బ్యాగులు ఇంకా వారికి పంపిణీ చేయని విషయాన్ని గుర్తించిన కలెక్టర్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎంను ప్రశ్నించారు. వెంటనే విద్యార్థులకు అందజేయాలని సూచించారు. పర్యటనలో చీపురుపల్లి ఆర్‌డిఒ. బి.శాంతి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.వి.భాస్కరరావు, తహశీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న ఆర్‌జెడి నాగరాజు



పారిశుధ్యానికి ప్రాధాన్యతివ్వాలి

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : రీజనల్ డైరెక్టర్ నాగరాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ నాగరాజు ఆదేశించారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాలలో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. ముందుగా దాసన్నపేట ఓరుగంటి వారి తోటలోకాలువల పూడికతీత పనులను పరిశీలించారు. ఆ తర్వాత గుణుపూరుపేట లో ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, లెగ్ సి వేస్ట్ మేనేజ్మెంట్ పని విధానాన్ని గమనించారు. అనంతరం కొత్తపేటలో కుక్కల శస్త్ర చికిత్స కేంద్రాన్ని పరిశీలించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజారోగ్య విభాగంతో సమీక్ష చేపట్టారు. అంతకుముందు అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నగరంలో కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అయితే ప్రజలు కూడా సహకరించి నీటి నిల్వలు లేకుండా దోమలు వృద్ధి కాకుండా చూడాలన్నారు. కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు, సహాయ కమిషనర్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఇఇ శ్రీనివాసరావు, డిఇలు ప్రజారోగ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్
అటల్ టింకరింగ్ ల్యాబ్‌లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అటల్ ఇన్నోవేషన్ మిషన్‌ను పూర్తిస్థాయిలో, మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ కోరారు. జిల్లా స్థాయి ఎటిఎల్‌పై సమీక్షా సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జరిగింది. డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ అటల్ ఇన్నోవేషన్ మిషన్ గురించి వివరించారు. విద్యార్థులకు నూతన అభ్యాస విధానాలకోసం 2016లో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం జిల్లాలో 42 పాఠశాలలను ఎంపిక చేశామని, వీటిలో 36 ప్రభుత్వ, 6 ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హబ్ అటల్‌గా ఎంపికైన ధర్మవరం పాఠశాల ల్యాబ్ ఇన్‌ఛార్జి రమేష్ కార్యక్రమం అమలును పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. నాలుగు ఏళ్లలో 65 ప్రాజెక్టులను చేశామని, వాటిలో 5 ప్రాజెక్టులు జాతీయ బహుమతులు గెలుచుకున్నాయని, ఒకదానికి పేటెంట్ దక్కిందని తెలిపారు. వివిధ పాఠశాలల ప్రతినిధులు మాట్లాడుతూ మిషన్ అమలు చేస్తున్న విధానాన్ని, సమస్యలను తెలిపారు. జెసి కార్తీక్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ ల్యాబ్‌లను ఉపయోగించుకోవాలని తెలిపారు. ప్రతీ మంగళవారం జరిగే ఆన్‌లైన్ క్లాసులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మా కళాశాలల ప్రొఫెసర్లతో, విద్యార్థులకు గెస్ట్ లెక్చర్లు ఇప్పించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డిఇఒలు కె.వెంకటరమణ, మోహనరావు, జిల్లా సైన్సు కో-ఆర్డినేటర్ ఎం.కృష్ణారావు, హెచ్‌ఎంలు, మోడల్‌స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, సైన్స్ ల్యాబ్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

రైతు సేవా కేంద్రాలను వినియోగించుకోండి

చిన్న తరహా పరిశ్రమల శాఖా మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-గంట్యాడ

రైతు సేవా కేంద్రాలను వినియోగించుకోవాలి రైతులందరూ వినియోగించుకోవాలని రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మదనాపురంలో గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్ష నివేదిక ఆధారంగా పంట రకాలను ఎంపిక చేసుకొని సాగు చేయడం వల్ల ఆర్థికంగా అభివృద్ధి సాధించ వచ్చునని అన్నారు. రైతులు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, డిపిఒ శ్రీధర్‌రాజా, ఎంపిపి హైమావతి, జెడ్‌పిటిసి వర్రి నరసింహ మూర్తి, సర్పంచ్ జె.పాపారావు, మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, మండల టిడిపి అధ్యక్షుడు కొండపల్లి భాస్కర నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి, డాక్టర్ రామలింగస్వామి తదితరులు

సాంస్కృతిక వారసత్వానికి సాక్షీభూతం

విజయనగరం వెలుగులు పుస్తకావిష్కరణలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరంకోట

సాంస్కృతిక వారసత్వానికి 'విజయనగరం వెలుగులు' పుస్తకం సాక్షీభూతంగా నిలుస్తుందని ఎమ్మెల్యేఅదితి విజయలక్ష్మి అన్నారు. విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర ఉపన్యాసకులు డాక్టర్ జివిఎస్. జయపాలరావు రచించిన 'విజయనగరం వెలుగులు' పుస్తకాన్ని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు బుధవారం ఆవిష్కరించారు. నగరంలోని ఎస్.కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్ పట్ల ఆకర్షితులవుతున్నారని, వారికి పుస్తకంలోని అంశాలను వీడియో రూపంలో కూడా అందిస్తే మరింత ఆకర్షితులవుతారని అన్నారు పుస్తక సమీక్షకులు కళా రత్న డాక్టర్ మీగడ రామలింగస్వామి మాట్లాడుతూ ఎందరో మహానుభావుల జీవిత చరిత్రలను ఒకే పుస్తకంలో తీసుకురావడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులకు ఇటువంటి పుస్తకాలు ఎంతో ప్రేరణ, ఉత్తేజాన్ని ఇస్తాయన్నారు. రచయిత జయపాలరావు మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని రాయడానికి తనకు ప్రేరణ ఎంఆర్ కళాశాల పూర్వ కరస్పాండెంట్ డాక్టర్ ఎ.రాఘవరావు, కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ పిఎఎన్ రాజు అని అన్నారు. దీనికంటే ముందు కరోనా సమయంలో జనతా కర్ఫ్యూ అనే పుస్తకాన్ని రాశానని తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంస్కృత కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.జనార్ధననాయుడు, డాక్టర్ ఎ.రాఘవరావు, మాజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.పిఎఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అండగా దిశా వన్ స్టాప్ సెంటర్

సీనియర్ సివిల్ జడ్జి విజయ కళ్యాణి

ప్రజాశక్తి-విజయనగరం కోట

బాలికలకు, మహిళలకు అండగా దిశా వన్‌స్టాప్‌సెంటర్‌ను వినియోగించు కోవాలని సీనియర్ సివిల్‌జడ్జి కె.విజయ కల్యాణి అన్నారు. బుధవారం ఈ సెంటర్‌ను సందర్శించిన ఆమె రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు బాధిత మహిళలతో మాట్లాడారు. యాసిడ్ దాడులు, ప్రేమ వైఫల్యం, వరకట్న వేధింపులు, ఆత్మహత్య ప్రయత్నం, కుటుంబ తగాదాలు, మైనర్‌లకు బలవంతపు వివాహాలు, వ్యభిచార వృత్తిలోకి దించే వేధింపులు, బాలికల అపహరణ, బిక్షాటనలోకి దించడం తదితర కారణాలతో బాధిత మహిళలకు కౌన్సిలింగ్, వైద్యం, న్యాయం, రక్షణ, పునరావాసం తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది, జిల్లా న్యాయ సేవాధికార సిబ్బంది పాల్గొన్నారు.

పార్కుల సుందరీకరణకు ప్రణాళికలు

కమిషనర్ ఎంఎం నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పార్కుల సుందరీకరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉద్యాన శాఖ అధికారులతో సమావేశమయ్యారు. కార్పొరేషన్ ఉద్యాన శాఖ అధికారి ఉమా భరణి, డిఇ ప్రవీణ్ కుమార్‌తో పార్కులలో చేపట్టబోయే కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రస్తుతం నాలుగు పార్కులు అన్ని హంగులతో అభివృద్ధి చెందాయన్నారు. మిగిలి ఉన్న 80 పార్కులలో మొక్కలను పెంచి చుట్టూ ఆహ్లాదకర వాతావరణ నింపే ఏర్పాట్లకు ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. ఉద్యాన, అటవీశాఖ అధికారుల సంయుక్త సహకారంతో మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. మొక్కల సంరక్షణకై జియో టాగింగ్ విధానాన్ని అమలులోకి తెచ్చే ఆలోచన చేస్తున్నామన్నారు. సమావేశంలో ఇఇ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తుకు దూరం కావద్దు

వ్యక్తిత్వవికాస నిపుణులు ఉదయ్‌కుమార్

ప్రజాశక్తి-విజయనగరం కోట

మాదక ద్రవ్యాల మత్తులో బంగారు భవిష్యత్తుకు దూరం కావద్దనిప్రముఖ వ్యక్తిత్వవికాస నిపుణులు, రచయత అలజంగి ఉదయ్ కుమార్ యువతకు సూచించారు. బుధవారం ఎం.ఆర్. కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా 'మాదక ద్రవ్యాలు - దుష్పరిణామాలు - యువత పాత్ర' అనే అంశంపై వన్‌టౌన్‌పోలీసుల ఆధ్వర్యాన సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి విశాఖపట్నంకు చెందిన ప్రముఖ వ్యక్తిత్వ నిపుణులు, రచయత అలజంగి ఉదయ్ కుమార్ హాజరై, విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. విద్యార్థులు చెడు స్నేహాలతో మొదట సరదాగా ఏర్పడిన మాదక ద్రవ్యాల వినియోగం క్రమేపీ వాటికి బానిసలుగా మారుస్తుందన్నారు. ఇలా బానిసలుగా మారిన యువత బంగారు భవిష్యత్తును కోల్పోయి, మత్తు పదార్థాలకు అలవాటుపడి, తమ అవసరాలకు దొంగతనాలు, గంజాయి అక్రమ రవాణా, చైన్ స్నాచింగ్ వంటి నేరాలకు పాల్పడుతున్నారన్నారు. మాదక ద్రవ్యాల అలవాటు వ్యసనంగా మారిన తరువాత విచక్షణ కోల్పోయి, మత్తులో ఏమి చేస్తున్నారో తెలియని స్థితిలో అఘాయిత్యాలు, దాడులకు పాల్పడుతూ నేరస్తులుగా మారుతున్నారన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరం కావాలని, వాటికి స్వస్తి పలికి, తల్లిదండ్రుల కలలను నిజం చేస్తూ, లక్ష్యం సాధించే దిశగా సాగాలన్నారు. వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు మాట్లాడుతూ - క్రమ శిక్షణతో విద్యను పూర్తి చేస్తేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తాత్కాలిక ఆనందం కోసం, చెడు సహవాసాలు, చెడు వ్యసనాలకు అలవాటు పడవద్దని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పే మంచి మార్గంలో ప్రతీ ఒక్కరూ పయనించాలని , తద్వారా ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. కార్యక్రమంలో సీడ్ విముక్తి ఆర్గనైజేషన్ ప్రాజెక్ట్ ఇన్చార్జి వై.కాళి ప్రసాద్ వన్ టౌన్ ఎస్‌ఐలు ఎ.నరేష్, హరిబాబు నాయుడు, నవీన్ పడాల్, ఎం.ఆర్.కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్లగెడ్డను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని అసంపూర్తిగా ఉన్న గుర్ల గెడ్డ ప్రాజెక్టును డిఇలు గోవిందరావు, పాండు బుధవారం పరిశీలించారు. కూలిపోయిన ఆక్విడెక్టు, స్ట్రక్చర్‌ను పరిశీలించారు. మట్టికట్టను పడమర దిశ వరకు 200 మీటర్లు పొడిగిస్తే మరో 3వేల ఎకరాకల సాగునీరు అందుతుందని తెలిపారు. ఈమేరకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. రైతులు బర్లి సీతంనాయుడు, చలుమూరి రామ్మూర్తి తదితరులు అధికారుల వెంట ఉన్నారు.

7న ఓపెన్ చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయ నగరం చదరంగం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7న జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ కమిటీ సభ్యులు ఎన్.బంగారు బాబు తెలిపారు. బుధవారం టోర్నమెంట్ కు సంబంధించి ఆహ్వాన ప్రతులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ వేణుగోపాల్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీలో పాల్గొనేందుకు ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదన్నారు. ఆదివారం ఉదయం 9గంటలకు ఉడా కాలనీ బంగారమ్మ గుడి దగ్గరలో గల ఎన్‌ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులతో పాటు వివిధ వయసు గల గ్రూపులలో ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించిన వారికి బహుమతులు ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9100469919 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో టోర్నమెంట్ కమిటీ సభ్యులు ఈపు విజయ్ కుమార్, సముద్రాల గురు ప్రసాద్, ఎస్‌విఎస్ రామకృష్ణ, ఆర్‌వి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి గోవిందరావు

కొత్త చట్టాలపై పోలీసులకు అవగాహన

ప్రజాశక్తి - భోగాపురం

కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన చట్టాల గురించి విజయనగరం డిఎస్‌పి ఆర్ గోవిందరావు సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. గతంలో ఉన్న చట్టాలకు ప్రస్తుతం ప్రభుత్వం పెట్టిన చట్టాలకు మధ్యనున్న తేడాను వివరించారు. స్టేషన్ పరిధిలోని వివిధ కేసులతోపాటు అధ్యక్ష కేసుల గురించి ఆరా తీసినట్లు తెలిసింది. ఎస్ఐలు సూర్య కుమారి, హేమంత్ కుమార్, తాతారావు, ఎఎస్ఐలు రాజు, తవుడు తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లపై అధికారుల కొరడా

విజయనగరం టౌన్ : నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న హోటళ్లపై నగరపాలక సంస్థ అధికారులు కొరడా ఝులిపించారు. బుధవారం నగరంలో వివిధ హోటళ్లను తనిఖీ చేసి మూడింటికి జరిమానా విధించారు. కాలువల్లో హోటల్ వ్యర్థాలను విడిచి పెడుతున్న కారణంగా ఒక హోటల్‌కు, వంటగది పరిశుభ్ర వాతావరణంలో లేకపోవడంతో మరో హోటల్‌కు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వినియోగిస్తున్నందుకు మరో హోటల్ యాజమాన్యానికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎంఎం నాయుడు మాట్లాడుతూ వ్యాపారులు ప్రజలకు ప్రతి ఒక్కరూ జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రజారోగ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, రామకృష్ణ, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

13వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

కొత్తవలస: జిందాల్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 13వ రోజుకు చేరింది. జిందాల్ యాజమాన్యం లే ఆఫ్ పేరుతో కార్మికులను బయటికి నెట్టి నేటికి 48 రోజులు గడుస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యం స్పందించి కార్మికులను పనిలో పెట్టేనంతవరకు తమ పోరాటం ఆగదని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎప్పుడూ, ఎవ్వరు లేని విధంగా యాజమాన్యం తీరు కనిపిస్తుందని అన్నారు. జిందాల్ యాజమాన్యం కనీసం స్పందించకపోవడం పై కార్మికులు, నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిందాల్ టాప్ యాజమాన్యం దిగివచ్చి కార్మికులందరికీ భేషరతుగా పని కల్పించాలని కోరారు. జిందాల్ కర్మాగారంలో కార్మిక సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. జిందాల్ జెఎసి నాయకులు పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావు, నమ్మి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు పరిశీలన

తెర్లాం: మండల కేంద్రంలోని దాసరి బందకు వెళ్లే ప్రధాన కాలువ మంగళగడ్డపై అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని సదరు రైతులు ఫిర్యాదు మేరకు తహశీల్దార్ రాజ్యలక్ష్మి కట్టడాలను బుధవారం పరిశీలించారు. ఈ కట్టడం అక్రమమని నిర్ధారించారు. తదుపరి చర్యలు ఆదేశం తెలియజేసే చర్యలు చేపడతామని అన్నారు. ఈ పరిశీలనలో పంచాయతీరాజ్ ఎఇ రాజశేఖర్, ఇరిగేషన్ ఎఇ హరి, మండల సర్వేయర్ వెంకటేష్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

సహారా డిపాజిట్ సొమ్ము చెల్లించాలి

బొబ్బిలి: సహారా డిపాజిట్ సొమ్ము చెల్లించాలని సహారా ఏజెంట్స్, ఖాతాదారుల పోరాట కమిటీ కన్వీనర్ బిబిల్ దాసు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సహారా యాజమాన్యం అధిక వడ్డీలు ఆశ చూపి 13 కోట్లమంది నుంచి రూ.3లక్షల కోట్లు డిపాజిట్లు సేకరించి తిరిగి చెల్లించడం లేదన్నారు. 12 ఏళ్ల నుంచి డిపాజిట్ సొమ్ము చెల్లింపులు నిలిపివేయడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2023 జూలై 18న సిఆర్‌సి పోర్టల్‌లో రూ.5వేల కోట్లు ఒక్కొక్క ఖాతాదారునికి రూ.10వేలు చొప్పున చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ రూ.229 కోట్లు చెల్లించి రూ.249కోట్లు జీతాలకు, ఇతర ఖర్చులకు కేటాయించడం దుర్మార్గమన్నారు. డిపాజిట్ సొమ్ము చెల్లించాలని పోరాట కార్యాచరణ కోసం ఈ నెల 5న గంటి ప్రసాదం భవనంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏజెంట్లను, ఖాతాదారులను కోరారు. కార్యక్రమంలో వైవి నాయుడు, ఎటి నాయుడు ఉన్నారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్త తీసుకోవాలి

గంట్యాడ: సీజనల్ వ్యాధులు సంభవించకుండా ముందుగా జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్య సంయుక్త సంచాలకులు వైవి రమణ అన్నారు. బుధవారం గంట్యాడ పశువైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు రాకముందే మేకలు, గొర్రెలలోని సీజనల్ వ్యాధులు సంభవించకుండా జాగ్రత్తలు పడాలన్నారు. జూలై ఆరవ తేదీన ప్రపంచ జూనోసిస్ దినోత్సవం జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో నిర్వహించి కుక్కలు, పిల్లి కుక్కల వ్యాధి నివారణకు యాంటీ రేబీస్ ఉచితంగా 28,490 డోసులు వేస్తామన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఆగస్టు 20వ తేదీ వరకు లంప్ స్కిన్ వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.కృష్ణ, సహాయకులు రాజు, గోపాల మిత్రలు రమణ, రాము తదితరులున్నారు.

అభ్యసనతో కూడిన విద్య అందించాలి

రేగిడి: విద్యార్థులకు అభ్యసనతో కూడిన విద్యను అందించాలని ఎంఇఒ ఎం.వరప్రసాద్‌రావు సూచించారు. బుధవారం ఆర్ ఆమదాలవలస కాలనీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పిఎం పోషణ భోజన పథకాన్ని తనిఖీ చేశారు. నాణ్యమైన, రుచికరమైన వంటలు వండాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి ఇంకా రుచికరమైన ఆహారం అందించాలని ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యను పెంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ప్రధానోపాధ్యాయులు పాలవలస రమేష్ కుమార్‌కు సూచించారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

గంట్యాడ: విత్తన శుద్ధి వల్ల తెగుళ్లను నివారించవచ్చునని, బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేయాలని రైతు సాధికారత సంస్థ ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్చార్జ్ వర్రి గాయత్రి అన్నారు. బుధవారం కొత్త వెలగాడ గ్రామంలో విత్తన శుద్ధి పై అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి చేయటం వల్ల విత్తనం ద్వారా భూములో ఉన్న తెగుళ్లువ్యాపించకుండా నారు ఆరోగ్యంగా పెరగడానికి ఉపయోగపడు తుందన్నారు. అనంతరం రైతులతో విత్తన శుద్ధి చేయించి అవగాహన కల్పించారు. ఐసిఆర్‌పి కె.జ్యోతి రైతులు పాల్గొన్నారు.

సంకిలిలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో బుధవారం నుంచి ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ బుడుమూరు పట్టాభి, పంచాయతీ కార్యదర్శి శివకృష్ణ ఆధ్వర్యంలో ఈ పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామపంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి పారిశుధ్యం మెరుగునకు నిధులు కేటాయించి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పనులు ఐదు రోజులు ఉంటాయని వెల్లడించారు.

ఆంగ్ల అధ్యాపకునికి డాక్టరేట్

భోగాపురం: రావాడ అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకునిగా గండి శోభన్‌కు డాక్టరేట్ లభించింది. ఆంధ్ర యూనివర్సిటీ, ఆంగ్ల సాహిత్య విభాగంలో శోభన్ ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ అందుకున్నారు. ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పర్యవేక్షణలో భారతీయ ఆంగ్ల సాహిత్యంలోని శోభన్ బంత్వాల్ అనే రచయితపై పరిశోధన చేసినందుకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పివిజిడి ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. అవంతి విద్యా సంస్థల వ్యవస్థాపకులు, అధ్యక్షులు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ సందర్భంగా బుధవారం శోభన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అవంతి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.భాస్కర రావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అర్హులకు పింఛను ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చోడమ్మ అగ్రహారంలో అర్హులకు ఫించన్లు ఇవ్వాలని టిడిపి నాయకులు పిళ్లా శ్రీరాములు కోరారు. గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో బాధితులతోపాటు ఆయన కార్యదరి జ్యోతికి వినతి అందించారు. భర్తను కోల్పోయిన వితంతువులు ఎన్ని సూరమ్మ, మచ్చపార్వతి, గుడివాడ అప్పలనరసమ్మ, వృద్ధాప్యంతో పిఠాపురం లక్ష్మణ, పిసిని సీతాలక్ష్మి, గుడివాడ సీతమనాయుడు, గుడివాడ అప్పన్న మరో 20 మంది ఉన్నారన్నారు. వీరంతా అర్హులైనప్పటికీ గత ప్రభుత్వం హయాంలో అనేకసార్లు సచివాలయంను సంప్రదించిన పింఛన్ రాలేదన్నారు. వీరందరికీ పింఛన్లు ఇవ్వాలని కోరారు.

విద్యకే తొలి ప్రాధాన్యం : ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి- బాడంగి

ప్రభుత్వం విద్యకే ప్రథమ ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక జెడ్‌పి పాఠశాలలో బుధవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఎం దత్తి సత్యన్నారాయణ అధ్యక్షతన విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ప్రవేటు పాఠశాలలకు ధీటుగా సౌకర్యాలు కల్పిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాలికల కోసం నిర్మించిన వసతిగృహాన్ని తెరిచేలా, పాఠశాలలో టాయిలెట్స్, డైనింగ్ హాల్, మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం దృష్టిలో పెట్టి సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, ఎంపిపి భోగి గౌరీ, వైస్ ఎంపిపి ఎస్ భాస్కరరావు, ఎంపిటిసి డి. శ్రీనివాసరావు, సర్పంచ్ కె.రమేష్, డిప్యూటీ డిఇఒ మోహన్ రావు, తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒలు, ఎస్ఐ జయంతి, ఎంపిటిసిలు, సర్పంచులు, పార్టీ నాయకులు, మండలంలోని ఉన్న అన్ని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గరివిడి: పిల్లలకు బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళా

విద్యాకిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కళా

గరివిడి: మండల కేంద్రంలోని ఎంఇఒ కార్యాలయంలో విద్యాకిట్లును ఎమ్మెల్యే కళా వెంకటరావు చేతులు మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళావెంకటరావు మాట్లాడుతూ విద్యార్థుల దశ దిశ మార్చేది విద్యేనని, పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తామని చెప్పారు. విద్యతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామమల్లిక్ నాయుడు, ఎంఇఒ రామారావు, టిడిపి మండల అధ్యక్షులు సారెపాక సురేష్‌బాబు, రమణమూర్తి, మన్నేపూరి సూర్యనారాయణ, వి. శ్రీనివాసురావు కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి బుధవారం విద్యా కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారని, ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డిఎస్‌సి ప్రకటించారని చెప్పారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చాలామంది విద్యార్థులు పరీక్షలకు దూరమయ్యే పరిస్థితి వచ్చిందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పెద్ద మనసుతో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, సర్పంచ్ సంతోష్ కుమారి, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, వైస్ ఎంపిపి రమణాజీ, జెడ్‌పిటిసి బీశెట్టి అరుణ, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చక్క కిరణ్, క్లస్టర్ ఇంచార్జ్ కాపుగంటి వాసు, నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు అనకాపల్లి చెల్లయ్య, తెలుగు యువత వాకాడ బాలు, బంగారు నాయుడు, హైటెక్ సురేష్, వాకాడ మురళి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆశాలతో మాట్లాడుతున్న శంకరరావు

10న డిమాండ్స్ డే

బొబ్బిలి: ఈ నెల 10న ఆశ కార్యకర్తల డిమాండ్స్ డే నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గతంలో వైసిపి ప్రభుత్వం అన్ని రంగాల కార్మికులను నష్టం చేసే విధానాలను అమలు చేయడంతో వైసిపిని ఓడించి టిడిపి కూటమిని ప్రజలు, కార్మికులు గెలిపించారని చెప్పారు. టిడిపి ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కారానికి పని చేయాలని కోరారు. కేంద్రంలో ఎన్.డి.ఎ ప్రభుత్వం కార్మికుల హక్కులపై దాడి చేస్తున్నదన్నారు. లేబర్ కోడ్ తీసుకొచ్చి కార్మికులకు అన్యాయం చేస్తుంద న్నారు. లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేసి కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 10న జరగనున్న డిమాండ్ డేని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆశ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు లంక శాంతమ్మ, మీసాల లక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

కౌలురైతులను గుర్తించాలి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని 25 సచివాలయ పరిధిలో రైతులకు గుర్తింపు కార్డుల ఎంపికకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎఒ గిరడ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం చాటాయివలస, లక్ష్మం పురం, దేవుదళ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతు గుర్తింపు ఈనెల 10 వరకు రైతు సేవ కేంద్రాలలో గ్రామ సభలో ఉంటాయన్నారు. కౌలు రైతులుగా గుర్తించిన వారికి 11 నెలలు కాల పరిమితితో కౌలు దారు కార్డులు అందజేస్తామన్నారు. కౌలుకు ఒక్క ఎకరా పొలం చేసుకున్న రైతులందరూ అర్హులని చెప్పారు. అర్హత కలిగిన కౌలుదారులని గుర్తించి, వారికి కౌలు గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, విఆర్ఒలు, రైతులు పాల్గొన్నారు.

డెంకాడ: కౌలు రైతులు గుర్తింపు కోసం పేర్లు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ జె రామారావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంట సాగు దారుల హక్కుల కార్డులు సిసిఆర్‌సి కోసం 2024 - 25కు గాను కౌలు రైతులు గుర్తింపు కోసం బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ఖరీఫ్, రబీ పంట కాలానికి సంబంధించి పొలం కౌవులకు సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా రెవెన్యూ శాఖ జారీ చేసిన కౌలు గుర్తింపు కార్డు తీసుకోవాలన్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డు కోసం సొంత రైతు పొలం పాస్ బుక్కు వన్‌బి జెరాక్స్, సొంత రైతు ఆధార్ కార్డు జెరాక్స్, కౌలు రైతు ఆధార్ కార్డు జెరాక్స్, కౌలు రైతు పాస్‌పోర్టు సైజు మూడు ఫోటోలు, కౌలు రైతు అప్లికేషన్ తీసుకువచ్చి పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ గుర్తింపు కార్డులు బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు మాత్రమే ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో ఎఒ నిర్మల, డిప్యూటీ తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

జిఒ 117 రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - వంగర

ప్రభుత్వ పాఠశాలల మనుగడకు గొడ్డలిపెట్టులా ఉన్న జిఒ 117ను రద్దు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పక్కి వాసు ప్రభుత్వాన్ని కోరారు. మండల యుటిఎఫ్ శాఖ జరిపిన సభ్యత్వ నమోదు కార్యక్రమం లో భాగంగా మండలంలో వివిధ పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా గత ప్రభుత్వం అమలు చేసిన జిఒ 117 వల్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు నమోదు శాతం తగ్గిపోయిందని, ఇదే కొనసాగితే కొన్ని సంవత్సరాలలో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయి పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రభుత్వ విద్య దూరం అయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేసి ప్రభుత్వ పాఠశాలను కాపాడాలని కోరారు. అనంతరం అరసాడ, వంగర పాఠశాల సముదాయంలో గల వివిధ పాఠశాలను సందర్శించి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయ సమస్యపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ వంగర శాఖ అధ్యక్షులు యం ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పెంకి గౌరిశంకర్ రావు, కోశాధికారి బి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు వి శ్రీనివాసు నాయుడు, టి శ్రీనివాసరావు, బి సింహాచలం, ఆర్ శ్రీనివాసరావు, వి తిరుపతి, కె శ్రీనివాసరావు, వై జయరాం, పి జ్యోతి, పి మురళి, యస్ అప్పలనాయుడు, వై మురళి, కె చూడామని, కె తిరుపతి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తోటపల్లి నీటిని వృథా కానివ్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బాడంగి

తోటపల్లి రిజర్వాయర్ నుంచి తమ నియోజక వర్గం మీదుగా వెళ్తున్న కాలువ వృథా పోకుండా రైతులకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. మండలంలోని అల్లుపాల్తేరు వద్ద వేగావతి నదిపై నిర్మించిన అక్విడేట్ సమీపంలో కాలువ రక్షిత గోడకు రంధ్రం పడి సాగునీరు వృథా కావడాన్ని బుధవారం ఆయన స్వయంగా పరిశీ లించారు. ఆ గ్రామ టిడిపి నాయకుడు, మాజీ ఎంపిపి గొంతు త్రినాధనాయుడు కోరిక మేరకు గండి పడిన ప్రాంతానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అల్లు పాల్తేరు నుంచి అక్విడేట్ మీదుగా వెళ్లే రహదారిలో రోడ్డుకు కూడా పెద్ద గండిపడటాన్ని ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. తదుపరి అక్విడేట్ వంతెనను దర్శించారు. అక్విడేట్ పైనున్న రహదారిని ఎత్తు చేయకుండా వదిలివేయడంతో మట్టితో కూడుకుపోయి వర్షం పడితే నడవలేని పరిస్థితి ఏర్పడు తుందని పలువురు రైతులు ఆయన దృష్టికి తేగా తోటపల్లి కాలువ డిఇఇ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. బిల్లులు సక్రమంగా అవ్వక పోవడంతో గుత్తేదారు పనులు



గండి వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బేబినాయన

మధ్యలోని వదిలి వేసినట్టు చెప్పారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందేటట్టు తాత్కాలిక మరమ్మతులు చేపడతా మని, సీజన్ అనంతరం ప్రభుత్వపరంగా పక్కాగా మరమ్మ తులు చేయిస్తామని చెప్పారు. గత ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు, కాలువలు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట త్రినాధ నాయుడుతోపాటు, ఎంపిటిసి యజ్జల లక్ష్మి, పలువురు అల్లు పాల్తేరు రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం చుట్టూ యాభై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి బుధవారం ప్రారంభిం చారు. నియోజకవర్గంలో అధికారి కంగా చేపడు తున్న కార్యక్రమాలను మొక్కలు నాటడంతో ప్రారంభిం చడం ఆనందంగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు విరివిగా చెట్లు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యస్.సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, మండల విద్యాశాఖాధికారులు బి.నరశింగరావు, పి.గణపతిలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు జి.జగదీశ్వర రావు, తల్లి దండ్రుల కమిటీ చైర్మన్ వేమలి గోవింద, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

కిర్ల బస్ పునరుద్ధరణ

జామి: మండలంలోని కిర్ల గ్రామం మీదుగా కొట్యాడ - తలారీ ఆర్‌టిసి బస్సును మళ్ళీ పునరుద్ధరించారు. స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఈ బస్సును బుధవారం ప్రారంభించారు. గతంలో కిర్ల గ్రామం మీదుగా నడిచిన ఈ బస్సును గత ప్రభుత్వంలో జామి, జట్టేటీవలస గ్రామం మీదుగా మరల్చడంతో అప్పట్లో కిర్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తాజాగా టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సహకారంతో మళ్ళీ యాదాస్థితిలో బస్సు పునరుద్ధరించడంతో కిర్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు, కొత్తూరు మాజీ సర్పంచ్ శ్రీలక్ష్మి, దాసరి సత్యం, ఎస్. కోట డిపో మేనేజర్, స్థానిక దళిత నాయకుడు పత్రి అప్పారావు పాల్గొన్నారు.

గ్రామసభలో కార్యదర్శిపై ఆరోపణలు

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస మేజర్ పంచాయతీ గ్రామసభ సచివాలయం-4 కార్యాలయ ఆవరణంలో సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ గ్రామ సభలో మాజీ ఉప సర్పంచ్ ఎల్లపు సూరిబాబు మాట్లాడుతూ పంచాయతీ ఇఒ కన్నబాబుపై తీవ్రమైన ఆరోపణ చేశారు. తన ఇల్లు కట్టుకోవడానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును అడ్డుపెట్టుకుని ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. చివరికి ఇఒకు కూడా పంచాయతీ ప్లాన్ అప్రూవల్‌కు స్వయాన డబ్బులు ఇచ్చానని సభలో ఆరోపించారు. ఇటువంటి ఇఒ ఎక్కడ ఉండడని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీలో ఇటువంటి ఇఒ ఉండడం వల్ల ఎంతమంది బాధితులు ఇరుకున పడ్డారోనని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామసభ నిర్వహణకు గ్రామంలో గల ప్రజలు ఎవ్వరికి సమాచారం ఇవ్వకపోవడంతో ప్రజాప్రతినిధులు సైతం అసహనం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీరు సమస్యపై వాడి వేడిగా చర్చ జరిగింది. అడ్డూరివానిపాలెం గ్రామంలో డైరెక్ట్ పంపింగ్ ద్వారా వేసిన బోరును ఎందుకు తొలగించారో చెప్పాలంటూ మాజీ సర్పంచ్ ప్రస్తుత వార్డు నెంబర్ గొరపల్లి రాము నిలదీశారు. బోరుబావిలో బోరు ఎందుకు తొలగించారో చెప్పాలని, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బందిని నిలదీశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి కర్రి శ్రీను, వార్డు మెంబర్లు ఏడుకొండలు, అప్పికొండ శ్రీను, జనసేన నాయకులు అప్పారావు, నాయకులు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి - సంతకవిటి

మండల కేంద్రంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీ బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వినతులు వెల్లవలా వచ్చాయి. మండలంలో అన్ని గ్రామాలు నుంచి సుమారు 400 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మడ్డువలస పూర్తి ఆయకట్టుకు సాగు నీరందేలా చూస్తానని తెలిపారు. మండలంలో చాలా గ్రామాలకు సరైన రహదారి లేదని, కొన్ని గ్రామాలకు రోడ్డులు గుంతల మయం అయ్యాయని వీటికి నిధులు సమాకూర్చాలని, మండలంలో బస్‌లు పెంచాలని, సమయానికి బస్‌లు లేక చాలా ఇబ్బంది పడుతున్నారని రాష్ట్ర తూర్పు కాపు మాజీ చైర్మన్ కోళ్ల అప్పలనాయుడు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ నాయకలు మన్నేన రమేష్, సర్పంచ్ గట్టి భాను, కోళ్ల అప్పలనాయుడు, ఐటిడిపి నియోజకవర్గం అధ్యక్షులు బవిరి శ్రీనుబాబు పాల్గొన్నారు.



వినతిని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

6న గంటి ప్రసాదం వర్ధంతి

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక గంటి ప్రసాదం భవనంలో ఈనెల 6న గంటి ప్రసాదం వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు స్మారక సభ, ప్రగతిశీల కార్మిక సమైక్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.అప్పలనాయుడు, ఆర్.సత్యం చెప్పారు. వర్ధంతి సభ జయప్రదం చేయాలని బుధవారం గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు, కార్మికులు, రైతులు సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి గంటి ప్రసాదం అని గుర్తు చేశారు. వర్ధంతి సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పికెఎస్ నాయకులు కామినాయుడు, నల్లి తవిటినాయుడు, పిల్ల లక్షణరావు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ ప్రావీణ్యతపై లెండిలో వర్క్‌షాప్

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఇంగ్లీష్ ప్రావీణ్యత, విదేశ విద్యా అవకాశాలపై ఒక రోజు వర్క్‌షాప్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ కమ్యూనికేషన్ స్కిల్స్ ల్యాబ్‌లో ప్రఖ్యాత ఐరిష్ స్కాలర్ డేవిడ్ ఫాలన్ అతిథిగా హాజరై నిర్వహించారు. విదేశాలలో విద్యావకాశాలను పొందడంలో ఆంగ్ల భాషా ప్రావీణ్యం యొక్క కీలక పాత్రపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఐర్లాండ్‌లోని సంస్థలపై ప్రత్యేకంగా ప్రాధాన్యతనిస్తూ యూరప్‌లోని వివిధ విశ్వవిద్యాలయాల గురించి తన విస్తృత పరిజ్ఞానాన్ని పంచుకున్నారు. విద్యావిషయక విజయాన్ని సాధించడంలో, విదేశాలలో విద్యావకాశాలను పొందడంలో బలమైన కమ్యూనికేషన్ నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరిస్తూ భారత దేశంలో విద్యార్థుల సంయమనాన్ని కొనియాడారు. 21వ శతాబ్దంలో వస్తున్న మార్పులకు ధీటుగా ఇంజినీరింగ్ విద్యావిధానం మారబోతుందని అందుకు తగినట్లుగా ఉన్నత



విద్యార్థులతో మాట్లాడుతున్న డేవిడ్ ఫాలన్


విద్యను అభ్యసించాలని కోరారు. లియో గ్లోబల్ ఓవర్సీస్, వైజాగ్ డివిజన్ సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. లెండి ఇనిస్టిట్యూట్‌ల వైస్ ప్రిన్సిపాల్, సీనియర్ ఇంగ్లీష్ ప్రొఫెసర్ డాక్టర్ హరిబాబు తమ్మినేని పాల్గొని డేవిడ్ ఫాలన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లియో వైజాగ్ బ్రాంచ్ మేనేజర్ వాసవి, అన్ని విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నగరపంచాయతీ పరిధి జరజాపుపేట ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు ఉపాధ్యాయుడుగా పనిచేసి పదవీ విరమణ పొందిన పక్కి కూర్మారావును బుధవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు పాల్గొని ఉపాధ్యాయుని దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ వైస్ చైర్మన్ రామారావు, డిప్యూటీ ఇఒ రమణ, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గరివిడి: మండలంలోని కొండపాలెం ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయుని మిర్తిపాటి నిర్మల అధ్యక్షతన బుధవారం ఘనంగా సత్కరించారు. బయాలజీ అసిస్టెంట్‌గా పదవీ విరమణ చేసిన మర్రాపు అప్పారావు దంపతులను, స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన పాఠశాల సిబ్బంది బోని లక్ష్మీ దేవిని సత్కరించి బంగారు ఉంగ



నెల్లిమర్ల: ఉపాధ్యాయ దంపతులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ

రాలను జ్ఞాపికలుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు, బమ్మిడి అప్పలస్వామి, శివుకు కాంతారావు, పి.కుమార్, బి.వెంకటరావు, టిడిపి నాయకులు సత్తిరాజు, ప్రసన్న కుమార్, వై.సత్యం, బలగం వెంకటరావు, ఎంఇఒ రామారావు, అప్పన్న, సిబ్బంది, యుటిఎఫ్, ఎపిటిఎఫ్, పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొని వారి సేవలను కొనియాడారు.

పోగొట్టుకున్న 118 ఫోన్లు బాధితులకు అందజేత

ప్రజాశక్తి- విజయనగరం కోట

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 118 మొబైల్స్‌ను సైబర్ క్రైం పోలీసులు ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారు. వాటిని బుధవారం ఎస్‌పి ఎం.దీపిక ఆదేశాలతో సైబర్ సెల్ సిఐ టివి విజయకుమార్ సైబర్ క్రైం పోలీసుస్టేషను వద్ద బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ - సైబరు సెల్ పోలీసులకు మొబైల్ ఫోన్లు పోయినట్లుగా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా మొబైల్స్ ను ట్రేస్ చేసేందుకు సైబరు సెల్ పోలీసులు, సిబ్బంది నిరంతరం చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల గురించి ఫిర్యాదు చేసిన కొద్ది రోజుల్లోనే 118 మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసామన్నారు. వీటిని బాధితులకు అందజేశామన్నారు. పోయిన మొబైల్స్ గురించిన ఫిర్యాదులను https://www.ceir.gov.in ఆన్‌లైన్ ద్వారా, సైబర్ క్రైం పోలీసు స్టేషనులోను నేరుగా ఫిర్యాదులు స్వీకరించి, వాటిని ట్రేస్ చేసి, బాధితులకు అందజేస్తున్నామని తెలిపారు. కొంతమంది నేరస్థులు గంజాయి అక్రమ రవాణ, హత్యలు, ఇతర నేరాలను చేసేందుకు మొబైల్స్ వినియోగించిన తరువాత, ఆయా నేరాల నుండి తప్పించుకొనే క్రమంలో మొబైల్స్ ను పారేస్తారని, అటువంటి మొబైల్స్ ఎవరైనా వాడినట్లయితే పోలీసులు, కోర్టుల నుండి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని అన్నారు. కావున, దొరికిన మొబైల్స్ ను స్థానిక పోలీసు స్టేషనులో అప్పగించడం మంచిదని సిఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సైబర్ సెల్ ఎస్ఐలు ప్రశాంత్ కుమార్, నజీమా బేగం, కానిస్టేబుళ్ళు తిరుపతి, శ్రీనివాసరావు, రాజేష్, శిరీష పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితులకు జైలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా దిశ మహిళా పోలీసు స్టేషనులో 2021 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితులు పూసపాటిరేగ మండలం, తిప్పలవలస గ్రామానికి చెందిన రాగితి సత్తియ్యకు మూడేళ్ళు, వాసుపల్లి కన్నయ్యకు ఏడాదిజైలు శిక్ష విధిస్తూ విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి బుధవారం తీర్పు చెప్పారని సిఐ బి. నాగేశ్వరరావు తెలిపారు. తిప్పలవలస గ్రామానికి చెందిన సత్తియ్య, కన్నయ్య బాలికను అపహరించి, బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లుగా దిశ మహిళా పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ కెటిఆర్ లక్ష్మి పోక్సో కేసు నమోదు చేశారని తెలిపారు.దర్యాప్తులో నేరం రుజువు కావడంతో శిక్ష పడిందని తెలిపారు.